క్లుప్తంగా

కాశీనాధునికి సత్కారం



ఎలకుర్రు(పామర్రు): కాశీనాధుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టు నిర్వాహకులు నాగేశ్వరరావును పామర్రు కళాపీఠం సభ్యులు గురువారం సన్మానించారు. కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులైన వారికి ఉచితంగా సేవలను అందించడం అభినందనీయమని తెలిపారు. నాగేశ్వరరావు చేస్తున్న సేవలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కళాపీఠం ముఖ్య సలహా దారులు, ఫ్లెక్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పాగోలు మహదేవరాజు, సంయుక్త కార్యదర్శి పి.దుర్గా దినేష్, సభ్యులు కృష్ణమోహన్ తదితరులున్నారు.

సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ



గుడివాడ టౌన్: మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే శక్తివంతమైన సమాజం ఏర్పడుతుందనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఉద్దేశమని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గొర్ల శ్రీను, చింతల భాస్కరరావు తెలిపారు. స్లాటర్‌పేటలోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం సంరక్షణకు ప్రభుత్వం పోషకాహారం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సీడీపీవో విజయ ఫ్లారెన్స్, సూపర్‌వైజర్‌లు జయంతి, కె.నాగజ్యోతి, బీకేడీ భవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా సాంబశివరావు



గుడివాడ టౌన్: గుడివాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ నూతన అధ్యక్షుడిగా తుంపూడి నాగ వెంకట సాంబశివరావు ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సాంబశివరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా చెక్కా చెన్నకేశవరావు, ఉపాధ్యక్షులుగా బొగ్గారపు తిరుపతయ్య, పోకూరి మోహనరావు, కొత్తా వీరయ్య, కోశాధికారిగా విస్సంశెట్టి పూర్ణచంద్రరావు, కార్యవర్గ సభ్యులుగా తిరివీధి శ్రీరాములు, గోకవరపు శ్రీ నగేష్, బోగాది నాగమల్లేశ్వరరావు తదితరులున్నారు. సర్వసభ్య సమావేశానికి బొర్రా కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు.

విషం తాగిన యువకుడి మృతి

పెడన: మండల పరిధిలోని జింజేరు గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జక్కుల రాజ్‌కుమార్ (19) పెట్రోల్‌బంకులో పనిచేస్తుంటాడు. ఈ నెల ఒకటో తేదీన విషం తీసుకున్నాడు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పల్లె ప్రగతి సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు/కలిదిండి: పల్లెలు ప్రగతిబాటలో పయనించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కలిదిండి ఇందిరా కాలనీలో రూ.20 లక్షలు గడప గడపకు, రూ.5 లక్షలు ఇతర నిధులతో కలిపి నిర్మించిన సీసీ రోడ్డును గురువారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు భారీ ఎత్తున చేపడుతున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచ్ మసిముక్కు మారుతీప్రసన్న, వైస్ ఎంపీపీలు కనకదుర్గారాణి, నాగలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవికుమార్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యుడు చాంద్ బాషా, తిరుమలశెట్టి సుబ్రహ్మణ్యం, డాక్టర్ జాన్ విక్టర్, గొరిపర్తి సుబ్బారావు, నున్న కృష్ణ, బాబు, గుడివాడ ఫణికుమార్, మారుబోయిన విష్ణు, పెరుమాళ్ల సత్యనారాయణ, షేక్ దాదా, కందుల వెంకటేశ్వరరావు, నీలపాల భోగేశ్వరరావు, యాళ్ల జీవరత్నం పాల్గొన్నారు.



కలిదిండి మండలం ఇందిరా కాలనీలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

రహదారుల నిర్మాణంపై అధికారులతో చర్చిస్తాం

బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి

పామర్రు: జాతీయ రహదారుల నిర్మాణంపై సంబంధిత అధికారులతో త్వరలో చర్చిస్తామని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో గురువారం ఎంపీ బాలశౌరి నియోజవర్గ స్థాయి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర రహదారులను జాతీయ రహదార్లుగా మార్పుదల చేసే సమయంలో కొంత జాప్యం ఏర్పడుతుందని తెలిపారు. పామర్రు–చల్లపల్లి రహదారి, కూచిపూడి–జోకిపర్రు రహదార్ల పనులు త్వరలో నిర్వహిస్తామని చెప్పారు. విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిని ఆరు లైన్ల రహదారిగా మార్పుదల చేస్తామని పేర్కొన్నారు. పార్లమెంట్ పరిధిలో ఉన్న 10 ట్రాఫిక్ ఎక్కువగా రైల్వే గేట్లవద్ద ఫ్లై ఓవర్‌లు నిర్మిస్తామని వెల్లడించారు. రూ.20 కోట్లతో రహదార్ల నిర్మాణం పనులు నిర్వహించామని వివరించారు. అలానే రూ.5కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశామని తెలిపారు. పామర్రు నియోజకవర్గంలో సుమారు రూ.3కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. పమిడిముక్కల మండలం మంటాడ గ్రామంలోని బీసీ కాలనీలో మౌలిక వసతుల ఏర్పాటుకు రూ.కోటి మంజూరు చేసి గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా రూపొందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెదపారుపూడి మండలం దోసపాడు , మొవ్వ మండలం కాజ గ్రామాల వద్ద ఉన్న వంతెన నిర్మాణాలను ప్రాధాన్యతా క్రమంలో నిర్మిస్తామని చెప్పారు. విజయవాడ–మచిలీపట్నం రహదారి నుంచి ఉరుటూరు గ్రామం మీదుగా సత్యనారాయణపురం, ఆంజనేయపురం వరకు రహదారికి నిధులు మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అకాల వర్షాలతో జరిగిన నష్టాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.



మాట్లాడుతున్న మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, పక్కనే ఎమ్మెల్యే అనిల్‌కుమార్

డ్రెయిన్‌లో పూడిక తొలగింపునకు చర్యలు

ముదినేపల్లి రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపుబారిన పడ్డ పొలాల్లోని నీటిని తొలగించేందుకు అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. ఈ పొలాలను జిల్లా స్థాయి వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు ఇటీవల పరిశీలించగా ముంపు తొలగనిదే సంరక్షణ చర్యలు చేపట్టే అవకాశం లేదని గుర్తించారు. వీరందించిన నివేదిక మేరకు ప్రధానమైన బాడవ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, పూడిక తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డ్రెయినేజీ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అన్నవరం వద్ద బాడవ డ్రెయిన్‌ను బాగు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పొక్లెయిన్‌తో గుర్రపుడెక్క పూడిక తొలగింపు పనులను చేపట్టారు. మండవల్లి సబ్‌డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి, డ్రెయినేజీ ఏఈ భోగేంద్రప్రసాద్, ఈవోపీఆర్డీ విజయసారథి ఈ పనులను పరిశీలించారు. పొక్లెయిన్‌తో గుర్రపుడెక్క పూడిక తొలగింపు అనంతరం డ్రెయిన్‌లో ప్రవాహం పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుర్రపుడెక్క తొలగింపు అనంతరం నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పంచాయతీ దుకాణాల లీజు వేలం నిలుపుదల

కైకలూరు: కైకలూరు పంచాయతీకి చెందిన నీలం సంజీవరెడ్డి షాపింగ్ కాంప్లెక్సు దుకాణాల లీజు హక్కులకు వేలం నిలుపుదల చేసినట్లు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి గురువారం చెప్పారు. ఆమె మాట్లాడుతూ కాంప్లెక్సులో కొన్ని దుకాణాలకు జూన్ 6వ తేదీ నాటికి లీజు కాలపరిమితి ముగిసిందన్నారు. వీటికి 2015లో పంచాయతీ బుక్ విషయం 209 నంబరు ద్వారా కాలపరిమితి ముగిసిన తర్వాత తొలగించిన దుకాణ సముదాయాల గోడలను తిరిగి యథావిధిగా నిర్మించి పంచాయతీకి అప్పగిస్తామని తీర్మానం చేశారన్నారు. దుకాణాల లీజుల విషయమై కొందరు సమాచార హక్కు చట్టాన్ని ఆశ్రయించారన్నారు. మరొకరు వేలం పాటలను నిలుపుదల చేయాలని అర్జీ అందించారన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టరు, జిల్లా పంచాయతీ అధికారిని సంప్రదించి తిరిగి ఎప్పుడు వేలం నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని సర్పంచ్ తెలిపారు.

నాణ్యమైన ఉత్పత్తులకే గిట్టుబాటు ధరలు

ఉయ్యూరు కీటక శాస్త్రవేత్త డి.సుధారాణి

పామర్రు: నాణ్యమైన ఉత్పత్తులకే ఎగుమతుల అవకాశంతో పాటు గిట్టుబాటు ధరలు లభిస్తాయని ఏఆర్ఎస్ ఉయ్యూరు కీటక శాస్త్రవేత్త డి. సుధారాణి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులోని ఆర్‌బీకే -1 వద్ద రైతులకు ఏపీ ప్రభుత్వం వ్యవసాయశాఖ విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిమితికి మించి రసాయనాలు వాడకం వల్ల పంట నాణ్యత దెబ్బతింటుందని తెలిపారు. సాగులో అవసరాన్ని మించి పెట్టుబడులు పెట్టినా కూడా దిగుబడుల్లో ఏమీ మార్పు ఉండని రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరిలో కలుపు సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు వివరించామన్నారు. డీఆర్‌సీ డీటీసీ కె.జ్యోతిరమణి మాట్లాడుతూ వరి పంటలో ఎరువుల యాజమాన్య పద్ధతులు అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. అనంతరం గ్రామంలో ముంపునకు గురైన వరి పొలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఏడీఏ స్వర్ణలత, డీఆర్‌సీ ఏడీఏ కె. శ్రీనివాసరావు, ఏవో నాగరాణి, మండల ఆర్‌బీకే అధ్యక్షులు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, రైతులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, కోటిరెడ్డి, వీఏఏ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉయ్యూరు కీటక శాస్త్రవేత్త సుధారాణి

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

గుడివాడ టౌన్: మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా వస్తున్న వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ కేఏఎస్ చక్రవర్తి అన్నారు. స్థానిక కేటీఆఆర్ మహిళా కళాశాలలో గురువారం విద్యార్థులకు మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడం వలన నిమ్ము, వైరల్ ఫీవర్‌లు వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తరచూ చేతులు కడుక్కోవడం, పొడి దుస్తులు ధరించడం వంటివి చేయాలని తెలిపారు. అనంతరం కళ్ల కలకలు రాకుండా ఉచిత హోమియో మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కల్పన, మానవతా స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపకులు గుత్తా రమేష్, జిల్లా అధ్యక్షుడు పీవీ శేషగిరిరావు, చైర్మన్ యు.మారుతీ ప్రసాద్, గుడివాడ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, కార్యదర్శి డి.సరస్వతి, సభ్యులు దండమూడి సీతారామస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో వైద్యబృందం

మణిపూర్ దాడులకు నిరసనగా శాంతి ర్యాలీ



పమిడిముక్కల: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులకు నిరసనగా మండల కేంద్రంలో క్రైస్తవ సంఘాల ఆధ్వార్యాన గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవుల హక్కులను కాపాడాలని, దాడులను అరికట్టాలని నినాదాలు చేశారు. దాడులకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. శాంతిని నెలకొనేలా చూడాలని కోరుతూ వీరంకిలాకు సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం తహసీల్దార్ రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు కృపారావు, యేసుపాదం, మాసిలామణి, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కైలే చొరవతో రోడ్డు సమస్యకు మోక్షం

తోట్లవల్లూరు: పంచాయతీ పరిధిలోని ఓ రోడ్డు సమస్యకు పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ చొరవతో మోక్షం లభించింది. గ్రామంలోని రజకపేటలో ఓ రోడ్డు గత కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోకుండా అపరిష్కృత సమస్యగా మారింది. ఇటీవల జరిగిన గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అనిల్‌కుమార్ దృష్టికి సమస్యను మాజీ ఎంపీటీసీ లింగాల భ్రమరాంబ, పార్టీ నాయకుడు ఓగిరాల గణేష్, స్థానికులు తీసుకువచ్చారు. రోడ్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.
ఎమ్మెల్యే కైలే ఆదేశాలతో మాజీ వైస్ ఎంపీపీ పీఎస్ కోటేశ్వరరావు రూ. 80 వేల వ్యయంతో సుమారు 80 మీటర్ల రోడ్డును జీఎస్‌బీ మెటీరియల్‌తో అభివృద్ధి పరిచారు. దీంతో సమస్య పరిష్కారమైంది. స్థానికులు సైతం హర్షం వ్యక్తం చేయటంతో పాటు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



తోట్లవల్లూరు రజకపేటలో అభివృద్ధిచేసిన రోడ్డు

జగనన్న సురక్ష చరిత్రాత్మకం

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు/కలిదిండి: ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అనే నినాదంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కలిదిండి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో 79 సచివాలయయాలో 30,886 సర్టిఫికెట్స్‌ను అందించామని చెప్పారు. గత పాలనలో వివిధ ధ్రువపత్రాల కోసం మండల కేంద్రాలకు తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు జగనన్న సురక్ష ద్వారా నేరుగా గ్రామంలోనే 11 రకాల ధ్రువపత్రాలను పంపిణీ చేశామన్నారు. ఇందుకు సహకరించిన అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీలు కూసంపూడి కనకదుర్గా రాణి, కట్టా నాగలక్ష్మి, ఏఎంసీ ఉపాధ్యక్షులు పాము రవికుమార్, మండల పార్టీ అధ్యక్షులు తిరుమాని రమేష్, సర్పంచ్‌లు మసిముక్కల మారుతి ప్రసన్న పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఓటర్ల జాబితా పరిశీలన



మండవల్లి: మండలంలోని 49 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ఓటర్ల జాబితా పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ గురువారం చెప్పారు. ఈ నెల 21వ తేదీ వరకు జాబితా పరిశీలన నిర్వహిస్తారన్నారు. పరిశీలించి, సక్రమంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని సూచించారు. ఆర్ఐ పద్మరోజ తదితరులున్నారు.

దిగ్విజయంగా జగనన్న సురక్ష

గుడివాడ టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమం దిగ్విజయంగా పూర్తిచేశామని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం లో మొత్తం 83,005 ఇళ్లకు సంబంధించి 80,610 సురక్ష కార్యక్రమంలో సర్వే చేశామన్నారు. ఇందులో భాగంగా 1,270 మంది గ్రామ, వార్డు వలంటీర్లు సేవలందించారన్నారు. మొత్తం 11 రకాల సేవలకు సంబంధించి 40,180 దరఖాస్తులు రాగా 39,155 మంది లబ్ధిదారులకు కావలసిన ధ్రువీకరణపత్రాలు అందించామని చెప్పారు. వివిధ రకాల కారణాల చేత లబ్ధి కోల్పోయిన వారికి సంబంధించి కుల ధ్రువీకరణ పత్రాలు 17,335, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 14,030, బియ్యం కార్డులు 237, ఆధార్‌కు మొబైల్ లింక్ 2,700, ఇళ్ల స్థలాల పంపిణీకి అడ్డంకిగా ఉన్న 39 మందిని కుటుంబ సభ్యులుగా తొలగించి కొత్త ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మార్గం సుగమమం చేశామన్నారు. ఇతర అవసరాలకు సంబంధించి 259 మందికి సంబంధించిన ధృవీకరణపత్రాలు అందజేశామన్నారు. ప్రత్యేకించి గుడ్లవల్లేరు మండలంలో జిల్లాలోనే అత్యధిక సేవలు అందించి రికార్డు సృష్టించామన్నారు. కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, తహసీల్దార్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, హౌసింగ్ అధికారులతో పాటు, ఎంపీడీఓలు, సచివాలయ ఉద్యోగులు, మాజీ కౌన్సిలర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీపీలు, సర్పంచుల సేవలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టీకాలతో ముద్ద చర్మవ్యాధి నివారణ

ఏడీ పఠాన్ ముస్తఫా ఖాన్

కైకలూరు: ఆవులలో ముద్ద చర్మవ్యాధి (లంపి స్కిన్ డిసీజ్) వ్యాప్తి చెందకుండా ఆవులకు ముందస్తు టీకాలు వేయడంతో వ్యాధిని నిరోధించవచ్చని కై కలూరు పశుసంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ పఠాన్ ముస్తఫా ఖాన్ గురువారం చెప్పారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వము గతేడాది మాదిరి గానే టీకాలు ఉచితంగా సరఫరా చేస్తోందన్నారు. నియోజకవర్గ కైకలూరు, కలిదిండి మండలాల్లో పాడి రైతులందరూ ఆవులకు ముద్ద చర్మ వ్యాధి టీకాలు ఉచితంగా వేయించాలన్నారు. ఈ పక్రియ ఆగస్టు 1 నుంచి ఆగస్టు 31 వరకు సాగుతుందన్నారు. లంపి స్కిన్ వైరస్ బాహ్య పరాన్న జీవులైన ఈగలు, దోమలు, పేలు, కొనుసులు వంటి కీటకముల వలన వస్తుందన్నారు. పశువుల పాకలు శుభ్రంగా లేకపోయినా వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. పశువుల చావిడిని శుభ్రంగా ఉంచుతూ నాలుగు మాసాలు పైబడిన అన్ని వయస్సుల ఆవులకు, చూడి, పాడి ఆవులకు కూడా వ్యాక్సిన్ వేయించాలన్నారు. ఈ వ్యాధి వచ్చిన పశువులలో తీవ్రమైన జ్వరం, చర్మం మీద కణతలు రావడం, కణతలు పగిలి రక్తం కారడం, కాలు వాపు రావడం, చర్మం కాలినట్లు కనిపించడం, తర్వాత దశలో చర్మం అట్టకట్టి పెలుసులుగా ఊడిపోతుందన్నారు. చిన్నదూడలు ఈ వ్యాధి సోకడం వలన చనిపోయే ప్రమాదంకూడా ఎక్కువగా ఉందన్నారు. యజమానులు పశువైద్యుడు, గోపాలమిత్ర, సచివాలయ పశుసంవర్ధక సహాయకుడుని సంప్రదించి ఉచిత వ్యాక్సిన్ ఆవులకు చేయించాలని కోరారు.

కైకలూరు టౌన్ స్టేషన్‌లో రికార్డుల తనిఖీ



కైకలూరు: సాధారణ వార్షిక తనిఖీలలో భాగంగా కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్‌ను ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు గురువారం తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నెల వారి నమోదు కేసులు వాటి పరిష్కారం, సిబ్బంది పనితీరును కైకలూరు పట్టణ సీఐ ఆకుల రఘు నుంచి తెలుసుకున్నారు. స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణపై డీఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు.

సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

కై కలూరు: గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను అంగన్‌వాడీ సెంటర్లలో గురువారం పంపిణీ చేశారు. కై కలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ దండే పుష్పలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య కిట్లును కేంద్రాల్లో అందించారు. ముఖ అధారిత గుర్తింపును సెల్‌ఫోన్ల ద్వారా తీసి పారదర్శకంగా పంపిణీ చేశామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చెప్పారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ముర్రుపాలు అమృతతుల్యం



చోరగుడిలో మాట్లాడుతున్న సర్పంచ్ పూర్ణకుమారి

పమిడిముక్కల: తల్లిపాలు బిడ్డకి తొలి పోషణ, ముర్రుపాలు అమృత తుల్యం అని సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి అన్నారు. చోరగుడి సచివాలయంలో గురువారం తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాలలో బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పుష్కలంగా లభిస్తుందని చెప్పారు. అనంతరం టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేశారు. మంటాడ అంగనవాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు, టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ నందమూడి వీరమ్మ, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

మండవల్లి: మండవల్లిలో తల్లిపాల వారోత్సవాలను గురువారం ప్రారంభించారు. మండవల్లిలో నాలుగో అంగన్‌వాడీ సెంటర్‌లో సర్పంచ్ మెండా ఝాన్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఝాన్సీ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడానికి పలు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా తల్లిపాల వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



మండవల్లిలో తల్లిపాల వారోత్సవాలు ప్రారంభించిన సర్పంచ్ ఝాన్సీ